RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | బుధవారం 10-6-2026 | సంచిక: 13 | సంఖ్య: 254 పేజీలు: 4 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి




## లక్ష డాలర్ల హెచ్1బీ ఫీజు రద్దు!

- స్వాగతించిన ఎన్నారై సంస్థలు
- ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్న ప్రభుత్వం




2లో



## రాగానే దంచికొట్టింది

- సచివాలయం సమీపంలో ముంచెత్తిన వర్షం
- హైదరాబాద్‌లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం
- గంటల తరబడి ట్రాఫిక్ జామ్..నగరవాసి నరకయాతన
- బండ్లగూడలో విద్యుత్ తీగ తగిలి ఇద్దరు మృతి
- సిద్దిపేట జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన జొన్న, ధాన్యం


2లో

## విశాఖ వెళుతున్న జగన్..

- స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులకు పరామర్శ
- నిన్న విశాఖ స్టీల్ ప్లాంట్ లో ఘోర ప్రమాదం
- ఎనిమిది మంది కార్మికుల దుర్మరణం
- ఘటనపై ఇప్పటికే తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన జగన్



# వృద్ధి రేటు పెంపుపై సీఎం చంద్రబాబు ఫోకస్..



- పనితీరు ఆధారంగా శాఖలకు స్కోరింగ్
- వివిధ శాఖలకు కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు నిర్దేశించిన సీఎం
- పనితీరు ఆధారంగా స్కోరింగ్ విధానం అమలుకు నిర్ణయం
- ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికల రూపకల్పన
- ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్ ఫోర్స్ ఏర్పాటుపై ఆలోచన
- 2047 స్వర్ణాంధ్ర లక్ష్య సాధన కోసం డేటా ఆధారిత పాలనపై దృష్టి

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు, వృద్ధి రేటును పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యాచరణ ప్రారంభించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) లక్ష్యాలు, ప్రభుత్వ శాఖల పనితీరును కొలిచే కీ-పెర్ఫార్మెన్సు ఇండికేటర్ల (కేపీఐ)పై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, రవాణా, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో వివిధ శాఖలకు కేపీఐలను సీఎం నిర్దేశించారు. జాతీయ సగటు కంటే వెనుకబడిన సూచికలను మెరుగుపరచడమే కాకుండా, అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా లక్ష్యాలను చేరుకోవాలని స్పష్టం చేశారు. కేవలం నిర్దేశిత లక్ష్యాలే కాకుండా, వాస్తవ వృద్ధి

2లో




# 'కోటి' సంపద సృష్టి

- ఆర్థిక వ్యవస్థలో మహిళలు కీలక భాగస్వాములు కావాలి
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం
- మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వం కృషి
- మహిళాశక్తి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మహిళా సంఘాలకు చెందిన 553 బస్సులు ఆర్టీసీకి అందజేత

హైదరాబాద్: మహిళలు సంక్షేమ పథకాల లబ్ధిదారులుగానే కాకుండా ఆస్తుల యజమానులు, వ్యాపారవేత్తలు, సంపద సృష్టికర్తలుగా ఎదిగేవిధంగా సముచితమైన ప్రోత్సాహాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. వారిని రుణగ్రహీతల స్థాయి నుంచి ఆస్తుల యజమానుల స్థాయికి తీసుకెళ్లేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మండల మహిళా సమాఖ్యలు కొనుగోలు చేసిన 553 టీజీఎస్ఆర్టీసీ బస్సులను సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మంగళవారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన మహిళా సంఘాల సభ్యులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సంక్షేమం నుంచి సంపద సృష్టి వైపు మహిళలను తీసుకెళ్లే ఆర్థిక విప్లవానికి ఈ బస్సులు చిహ్నాలుగా నిలుస్తాయని అన్నారు.

## మమ్మల్ని కాదు, ఫ్యాక్టరీని కాపాడండి'..

- క్షతగాత్రుడి మాటలతో కదిలిపోయాను: మంత్రి లోకేష్
- విశాఖ స్టీల్ ప్లాంట్ లో ఘోర ప్రమాదం
- విశాఖలో మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించిన లోకేష్
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, శాశ్వత ఉద్యోగం హామీ
- కేంద్ర మంత్రి కుమారస్వామి, రాష్ట్ర మంత్రి లోకేష్ పరామర్శ
- ప్రమాద కారణాలపై ముగ్గురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు
- ఉక్కు కర్మాగారాన్ని కాపాడాలంటూ ఆసుపత్రిలో క్షతగాత్రుడి విజ్ఞప్తి

2లో






## రేవంత్‌వి బెదిరింపు రాజకీయాలు

- సీఎం హోదాలో ఉన్న వ్యక్తి వీధి రౌడీలా వ్యవహరిస్తున్నారు
- ముఖ్యమంత్రిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఫైర్
- రాష్ట్రానికి సంబంధించి నేను ఏదైనా ప్రాజెక్టును అడ్డుకున్నానని నిరూపించాలి
- అవసరమైతే మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధం
- ఆరు గ్యారెంటీల వైఫల్యం కప్పిపుచ్చుకునేందుకే నాపై విమర్శలు
- ధైర్యం ఉంటే హామీల అమలుపై బహిరంగ చర్చకు రావాలని సవాల్

2లో

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద స్థలాన్ని పవన్ పరిశీలన

- కిమ్స్ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన డిప్యూటీ సీఎం
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ
- నిపుణుల కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు
- త్వరలో కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహిస్తానని వెల్లడి

2లో





## తెలంగాణలో ఒంటరి పోరే

- మీడియాతో చిట్‌చాట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- డీలిమిటేషన్ బిల్లుపై సీఎం రేవంత్ వ్యాఖ్యల్లో తీవ్రత లేదు
- నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లుపై కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని.. ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దిగుతామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.

## మమ్మల్ని కాదు, ఫ్యాక్టరీని కాపాడండి'..

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు, క్షతగాత్రులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. బాధితులను పరామర్శించిన అనంతరం నారా లోకేష్ మీడియాతో మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం కల్పిస్తున్న భరోసాను వివరించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, కాంట్రాక్ట్ లేదా పర్మనెంట్ అనే తేడా లేకుండా మృతుల కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించిన వివరాలను లోకేష్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తరపున అదనంగా రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రతి కుటుంబానికి అందిస్తున్నట్లు తెలిపారు. నిన్న రాత్రి ఘటనా స్థలాన్ని సందర్శించిన కుమారస్వామి, ఈ మేరకు హామీ ఇచ్చారని చెప్పారు. కుటుంబంలో చదువుకున్న వారికి పర్మనెంట్ ఉద్యోగం ఇవ్వడంపై కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి నిబంధనల గురించి ప్రస్తావించగా, "అవసరమైతే కేబినెట్‌కు తీసుకెళ్లైనా దీన్ని సాధిస్తాను, ఇది నా బాధ్యత" అని కుమారస్వామి స్పష్టం చేశారని లోకేష్ వివరించారు.ప్రభుత్వం కేవలం హామీలు ఇచ్చి చేతులు దులుపుకోదని, బాధితులకు శాశ్వతంగా అండగా నిలుస్తుందని లోకేష్ స్పష్టం చేశారు. "నిన్న సాయంత్రం 4:10 గంటలకు ప్రమాదం జరగగానే కలెక్టర్, సీపీ ఘటనా స్థలానికి చేరుకున్నారు. హోం మంత్రి అనిత, ఎంపీ శ్రీభరత్, పల్లా శ్రీనివాస్ కూడా వచ్చారు. కేంద్ర మంత్రులు కుమారస్వామి, వర్మ కూడా వెంటనే స్పందించి పరిస్థితిని సమీక్షించారు. కుమారస్వామి గారు ఇచ్చిన ఆదేశాల మేరకు, ఈరోజు తేదీ మారేలోపే 8 మంది మృతుల కుటుంబాల అకౌంట్లలోకి తక్షణ సాయంగా రూ.25 లక్షలు జమ చేస్తాం. దీనితో పాటు పీఎఫ్, స్టీల్ ప్లాంట్ నిబంధనల ప్రకారం రావాల్సిన మిగతా పరిహారం కూడా త్వరలోనే అందిస్తాం" అని తెలిపారు.

## రాగానే దంచికొట్టింది

హైదరాబాద్: రాజధాని హైదరాబాద్‌లో మంగళవారం సాయంత్రం'నైరుతి' వాన దంచికొట్టింది. మధ్యాహ్నం వరకు సాధారణంగా ఉన్న వాతావరణం సాయంత్రానికి ఒక్కసారిగా మారిపోయింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షం బీభత్సం సృష్టించింది. అడిక్‌మెట్, విద్యానగర్, అంబర్‌పేట్, ఖైరతాబాద్, పంజగుట్ట, బంజారాహిల్స్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో మోకాలి లోతు నీరు నిలిచింది. పలు జంక్షన్లు చెరువులను తలపించాయి. సాయంత్రం 5 గంటల సమయంలో ఉద్యోగులు ఇళ్లకు బయలుదేరే వేళ వర్షం పడటంతో ఐటీ కారిడార్ సహా పలు మార్గాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో గంటల తరబడి వాహనదారులు నరకయాతన అనుభవించారు. మల్కాజ్‌గిరిలో 12.9 సెం.మీ. భారీ వర్షపాతం నమోదైంది. బన్సీలాల్‌పేటలో 8.7 సెం.మీ., విఠల్‌వాడీలో 7.8 సెం.మీ. వాన పడింది. మొత్తం 14 ప్రాంతాల్లో 5 సెం.మీ.కుపైగా వర్షం నమోదైంది. పలుచోట్ల చెట్లు, కొమ్మలు విరిగి రోడ్లపై పడ్డాయి. భారీ సైన్‌బోర్డులు, ఫ్లెక్సీలు ఊడి పడటంతో కార్లు, బైక్‌లు దెబ్బతిన్నాయి. భద్రతా కారణాలతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో వందల కాలనీలు గంటల తరబడి చీకట్లో మగ్గాయి.

## తెలంగాణలో ఒంటరి పోరే

తమకు ఒక స్పష్టత ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఏ ప్రాంతీయ పార్టీని దగ్గరకు చేర్చుకొనే అవకాశం లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. ఎన్డీయే ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చి బుధవారంతో 12 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలోని భారత్ మండంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. నియోజకవర్గాల పునర్విభజనతో ఎవరికీ అన్యాయం జరగదు..: డీలిమిటేషన్ బిల్లుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యల్లో తీవ్రత లేదని అమిత్ షా కొట్టిపారేశారు. నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల పెంపు బిల్లును ఆమోదించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో ఎవరికీ, ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని పునరుద్ఘాటించారు. లోక్‌సభలో ఆయా రాష్ట్రాలకు ప్రస్తుతమున్న నిష్పత్తి ప్రకారం అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్లు పెరిగేలా బిల్లును రూపొందించినట్లు చెప్పారు. అందుకు కావాల్సిన మద్దతు లభించగానే బిల్లును ఆమోదింజేసేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యాఖ్యానించారు.

బిల్లుకు అవసరమైన మద్దతు అభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వన్ నేషన్ వన్ బిల్లుపై ప్రస్తుతం కమిటీ అధ్యయనం చేస్తోందని.. నివేదిక రాగానే సబంధింత బిల్లుకు అవసరమైన మద్దతు లభిసుందని స్పష్టం చేశారు. ఎన్డీయే కూటమిలోని అన్ని పార్టీలు బలంగానే ఉన్నాయని.. తమతో కలిసి నడుస్తున్న ఏ ప్రాంతీయ పార్టీకీ ఎటువంటి ఇబ్బందులు లేవని చెప్పారు. మధ్యప్రదేశ్ రాజ్యసభ సభ్యురాలిగా తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ వేసిన నామినేషన్ తిరస్కరణతో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత కమలనాథ్ ఆమె నామినేషన్ పత్రాలను నింపారు కాబట్టే తిరస్కరణకు గురై ఉంటుందేమోనని ఎద్దేవా చేశారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద స్థలాన్ని పవన్ పరిశీలన

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖకు చేరుకున్న ఆయన కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులను స్వయంగా అడిగి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. అనంతరం స్టీల్ ప్లాంట్‌లోని ప్రమాద స్థలాన్ని పరిశీలించి యాజమాన్యం, ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు ప్రకటించారు. గాయపడిన వారికి రూ. 10 లక్షల చొప్పున సాయం అందిస్తామని, వారి పూర్తి చికిత్స ఖర్చులను ఆర్.ఐ.ఎన్.ఎల్. భరిస్తుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం కల్పిస్తామన్నారు. పదవీ విరమణ ప్రయోజనాల కింద రెగ్యులర్ ఉద్యోగులకు రూ. 1.72 కోట్లు, కాంట్రాక్టు ఉద్యోగులకు రూ. 45.75 లక్షలు అందుతాయని వివరించారు. మృతుల పిల్లల చదువులకు కూడా యాజమాన్యం సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. గత 30 ఏళ్లలో ఇలాంటి ఘోర దుర్ఘటన జరగలేదని పవన్ పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన ముందు రోజు రాత్రి కూడా ప్లాంట్‌లో ఇలాంటి చిన్న సాంకేతిక లోపం తలెత్తిందని, అయితే రాత్రి వేళ కార్మికులు ఎవరూ లేకపోవడం వల్ల ఎవరికీ తెలియలేదని తన దృష్టికి తెచ్చారని ఆయన వివరించారు. ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలు, యంత్రాల ఆధునికీకరణపై దర్యాప్తు చేయడానికి ఒక ప్రత్యేక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామని, వారి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

# 'కోటి' సంపద సృష్టి



మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 553 మండల మహిళా సమాఖ్యలు రూ.199.08 కోట్ల పెట్టుబడితో 553 బస్సులను కొనుగోలు చేసి టీజీఎస్‌ఆర్టీసీకి లీజుకు ఇచ్చినట్లు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రతి బస్సుకు నెలకు రూ.69,468 అద్దె లభిస్తుండగా, మొత్తం 553 బస్సుల ద్వారా మహిళా సమాఖ్యలకు నెలకు సుమారు రూ.3.84 కోట్ల ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఇప్పటివరకు రూ.20.34 కోట్లకు పైగా అద్దె ఆదాయం మహిళా సమాఖ్యలకు అందినట్లు చెప్పారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద ఇప్పటివరకు 308 కోట్లకు పైగా మహిళా ప్రయాణాలు నమోదయ్యాయని, రూ.10,696 కోట్ల ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకున్నారని వెల్లడించారు. మహిళా సంఘాలను రవాణా, వ్యవసాయం, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, సేవారంగం, వాణిజ్యం, పునరుత్పాదక ఇంధన రంగాల్లో భాగస్వాములను చేస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళా సంఘాల ద్వారా 1000 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

**గ్రామీణ ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర**

రాష్ట్రంలో ఒకేరకమైన పంటలు పండించే విధానానికి స్వస్తి పలకాలని, అన్ని రకాల పంటలను పండించేవిధంగా పంట మార్పిడి విధానంపై మహిళా సంఘాలు రైతులకు అవగాహన కల్పించాలని సీఎం కోరారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్ వ్యవస్థలు, గ్రామీణ ఆర్థికాభివృద్ధిలో మహిళా సంఘాలు మరింత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఇళ్లు, ఇతర ఆస్తులపై మహిళలకు యాజమాన్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. మహిళలకు శాశ్వత మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8 వేల ఇందిరా మహిళా శక్తి భవనాలను నిర్మిస్తున్నామన్నారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక మార్కెటింగ్, వాణిజ్య మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. దేశంలోనే అత్యంత విస్తృత మహిళా సాధికారత కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి సీతక్క చెప్పారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, మహిళలను లబ్ధిదారుల నుంచి యజమానులుగా తీర్చిదిద్దిన చారిత్రాత్మక కార్యక్రమంగా ఈ బస్సుల పంపిణీ నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, శాసనసభ్యులు నవీన్ యాదవ్, గణేష్, మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి?మ, తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కలువ సుజాత గుప్తా, టీజీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్‌వి బెదిరింపు రాజకీయాలు



న్యూఢిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసత్యపు వార్తలతో తనపై వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి అకారణంగా బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతూ వీధి రౌడీలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి సంబంధించిన ఏ ప్రాజెక్టును తాను అడ్డుకున్నానో నిరూపించాలని సవాల్ విసిరారు. ఇందుకు సంబంధించి సీనియర్ జర్నలిస్టులతో ఒక కమిటీ వేద్దామని, తనపై ఆరోపణలకు ఉన్న ఆధారాలను వారికి ఇవ్వాలని అన్నారు. వారు ఏ నివేదిక ఇస్తే దానికి కట్టుబడి ఉంటానని, అవసరమైతే పదవికి రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమని ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచి?చన 6 గ్యారెంటీలు, 420 సబ్ గ్యారెంటీల అమల్లో వైఫల్యం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే నాపై ఆరోపణలు చేస్తూ ముఖ్యమంత్రి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. ధైర్యం ఉంటే ఇచ్చిన హామీల అమలుపై ప్రెస్‌క్లబ్‌లో గానీ, అమరవీరుల స్తూపం వద్ద గానీ బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. మంగళవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పొలిమేరలు దాటనివ్వను, తెలంగాణలో తిరగనివ్వను అంటూ రేవంత్‌రెడ్డి చేస్తున్న తాటాకు చప్పుళ్లకు నేను భయపడను. ఎంతోమంది ముఖ్యమంత్రులను చూశా. వారి ఇళ్ల ముందే ఘెరావ్‌లు చేసి, ఉద్యమాలు చేస్తూ ఢిల్లీకి వచ్చా. అంబర్‌పేట్, సికింద్రాబాద్ ప్రజల ఆశీస్సులతోనే ఈ స్థాయికి ఎదిగా. రేవంత్‌రెడ్డి సరి?టఫికెట్ నాకు అవసరం లేదు. నేను తెలంగాణ ప్రజలకు మాత్రమే జవాబుదారీని. ప్యాంటుల్లో తొండలు వదలడం, కళ్లు పీకి గోలీలు ఆడటం, పేగులు మెడలో వేసుకోవడం వంటి నీచమైన, చిల్లర రాజకీయాలు నాకు రావు. నేను మాటకారిని కాకపోయినా మాట మీద నిలబడే వ్యక్తిని. పదవుల కోసం పార్టీలు మారే రకం కాదు. పదేళ్లు తానే సీఎం అని చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి, అభద్రతాభావం, అహంకారంతో సంస్కార హీనంగా ప్రవర్తిస్తున్నారు..'

## వృద్ధి రేటు పెంపుపై సీఎం చంద్రబాబు ఫోకస్..

(రియల్ గ్రోత్) ఆధారంగా శాఖల పనితీరును అంచనా వేసేందుకు స్కోరింగ్ విధానాన్ని అమలు చేయాలని సీఎం నిర్ణయించారు. రాష్ట్ర, క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను ఎప్పటికప్పుడు విశ్లేషించేందుకు ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలపై పెట్టే వ్యయం, ఆర్థిక కార్యకలాపాలను 3.5 రెట్లు పెంచేలా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఆర్థిక వ్యవహారాలను రియల్ టైంలో పర్యవేక్షించేందుకు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయాలనే ఆలోచనను కూడా పంచుకున్నారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా ఆధారిత పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. అమరావతి, పోలవరం, పోర్టులు, ఎయిర్‌పోర్టుల వంటి కీలక ప్రాజెక్టులతో ఆర్థిక వ్యవస్థకు 'మల్టిప్లైయర్ ఎఫెక్ట్' తీసుకురావాలని సూచించారు. కేపీఐలు మెరుగ్గా ఉంటేనే రాష్ట్ర వృద్ధి రేటు పెరుగుతుందని, ప్రతి రంగంలోనూ గ్రాస్ వాల్యూ అడిషన్ (జీవీఏ) పెంపుపై శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి అన్నారు.

## విశాఖకు వెళుతున్న జగన్..

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని రేకెత్తించింది. ఈ దారుణ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను, అలాగే గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించేందుకు వైసీపీ అధినేత జగన్ రేపు విశాఖలో పర్యటించనున్నారు. ఈ ప్రమాదంపై జగన్ ఇప్పటికే తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఘటన జరిగిన వెంటనే ఆయన స్పందిస్తూ... బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందేలా చూడాలని స్థానిక వైసీపీ నాయకులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు తన గాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు పార్టీ శ్రేణులు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. నిన్న సాయంత్రం స్టీల్‌ప్లాంట్‌లో ఒక పెద్ద పేలుడు సంభవించింది. 150 టన్నుల లాడిల్ నుండి కరిగిన ఉక్కు ఒక్కసారిగా కిందపడటంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా... మరో ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వారు నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో అత్యవసర చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం.

# లక్ష డాలర్ల హెచ్1బీ ఫీజు రద్దు!

వాషింగ్టన్: అమెరికా కలల్ని పండించే హెచ్1--బీ వీసా విషయంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ట్రంప్ సర్కారు విధించిన లక్ష డాలర్ల ఫీజును ఫెడరల్ కోర్టు కొట్టి వేసింది. కాంగ్రెస్ ఆమోదం లేకుండానే ఇంత భారీ మొత్తం వీసా ఫీజు వసూలుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం చట్టవిరుద్ధమని మసాచుసెట్స్ రాష్ట్రంలోని బోస్టన్ నగరంలోని ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి లియో సోరోకిన్ తీర్పు వెలువరించారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వు జారీ చేశారు. "అమెరికా కాంగ్రెస్ అనుమతిలేకుండా ప్రభుత్వం ఇలా భారీ స్థాయిలో పన్నులను మోపేందుకు అధికారంలేదు. ఇమ్మిగ్రేషన్ విధానాలు, పన్నులపై నిర్ణయాలు తీసుకునే అధికారం అమెరికా కాంగ్రెస్‌కు మాత్రమే ఉంది. ఫీజు, పేమెంట్ అని చెబుతున్నప్పటికీ వీసా పిటిషన్‌దారులపై ట్రంప్ పన్ను భారం మోపారు" అని జడ్జి తన తీర్పులో పేర్కొన్నారు. అమెరికాలోని భారతీయ సంతతి సంఘాలు ఈ తీర్పును స్వాగతించాయి. ఉద్యోగ ఆధారిత వీసాల విషయంలో ఇది మెరుగైన నిర్ణయమని కొనియాడాయి. అమెరికన్ కంపెనీలు నిపుణులైన విదేశీయులను నియమించుకునేందుకు హెచ్1--బీ వీసా అవసరం. భారతీయ ఐటీ ఉద్యోగులతోపాటు వివిధ దేశాల నుంచి పరిశోధకులు, అత్యాధునిక టెక్నాలజీ రంగాల్లో పని చేసేవారు హెచ్1--బీ వీసా కోసం ప్రయత్నిస్తుంటారు. అయితే, డొనాల్డ్ ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టిన తరువాత వీసా జారీ ప్రక్రియలో పలు మార్పులు చేయడమే కాకుండా ఒక్కో హెచ్1--బీ వీసా దరఖాస్తుకు లక్ష డాలర్ల ఫీజు విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై 20 రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తంచేస్తూ బోస్టన్ ఫెడరల్ కోర్టును ఆశ్రయించగా జడ్జి దీనిపై విచారణ జరిపి భారీ ఫీజు సరికాదని తేల్చి చెప్పారు. "హెచ్1--బీ వీసాతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపశమనం ఇచ్చిన తీర్పిది. అయితే ఈ విషయం ఇక్కడితో సమసిపోతుందా? అన్నది ప్రశ్నార్థకం" అని ఇండియాస్పోరా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ జోషీపుర వ్యాఖ్యానించారు. నిబంధనల పేరుతో అమెరికన్ ప్రభుత్వం హెచ్1--బీ వీసాదారులను ఇకపై కూడా ఇబ్బంది పెట్టే అవకాశాలు లేకపోలేదని హెచ్చరించారు. అమెరికా టెక్నాలజీ, ఆరోగ్య, తయారీ రంగాల పురోభివృద్ధికి అంతర్జాతీయ నిపుణులను ఆకర్షించాల్సిన అవసరం ఉందని ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పోరా స్టడీస్ చీఫ్ ఆఫ్ పాలసీ అండ్ స్ట్రాటజీ ఖండేరావ్ కాండ్ చెప్పారు. ఆర్థికపరమైన వాస్తవిక పరిస్థితులతోపాటు చట్టపరమైన అంశాలను పరిగణలోకి తీసుకున్న తరువాతే కీలకమైన విధానపర అంశాల్లో మార్పులు చేయాలన్న ప్రాథమిక విషయాన్ని ఈ తీర్పు స్పష్టం చేస్తోందని వివరించారు.

**ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేస్తాం**

లక్ష డాలర్ల హెచ్1--బీ వీసా ఫీజును రద్దు చేస్తూ మసాచుసెట్స్ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను అప్పీల్స్ కోర్టులో సవాలు చేయనున్నట్లు వైట్‌హౌస్ అధికార ప్రతినిధి ఒకరు సూచనప్రాయంగా తెలిపారు. హెచ్1--బీ వీసా పథకాన్ని దశాబ్దాలుగా దురి?వనియోగం చేస్తున్నారని, దీన్ని అరికట్టడానికే అధ్యక్షుడు ట్రంప్ చర్యలు తీసుకున్నారని చెప్పారు. కొంతమంది రిపబ్లికన్ పార్టీ ప్రతినిధులు కూడా లక్ష డాలర్ల వీసా ఫీజును న్యాయస్థానం కొట్టివేయడాన్ని స్వాగతిస్తుండడం గమనార్హం. భారీ వీసా ఫీజు కారణంగా వైద్య సిబ్బందితోపాటు ఉపాధ్యాయులను అమెరికాకు రప్పించడం చాలా కష్టమైపోయిందని, ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన టీచర్లు లేకుండా పోతున్నారని అలాస్కా రిపబ్లికన్ సెనేటర్ లీజా ముర్కోస్కీ చెప్పారు. అమెరికా ఆరోగ్య రంగంలో ఇప్పటికే సిబ్బంది కొరత ఉండగా.. లక్ష డాలర్ల వీసా ఫీజు అదనపు భారం మోపిందని, కోర్టు తీర్పుతో భారీ ఊరట లభించినట్లేనని నార్త్ వర్జీనియా డెమోక్రాట్ ప్రతినిధి డాన్ బేయర్ హర్షం వ్యక్తంచేశారు. రిపబ్లికన్ ప్రతినిధి మైక్ లాలర్, జార్జియా డెమోక్రాట్ ప్రతినిధి సాన్‌ఫర్డ్ డి.బిషప్, కాలిఫోర్నియా, న్యూజెర్సీ అటార్నీ జనరళ్లు రాబ్ బోంటా, జెన్నిఫర్ డావెన్‌పోర్టు తదితరులు కోర్టు తీర్పును స్వాగతించారు.

## హైదరాబాద్ చేరుకున్న అనురూప్ రెడ్డి మృతదేహం

### అనూప్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు

### కుటుంబానికి అండగా ఉంటామని హామీ

హైదరాబాద్: అమెరికాలోని లూసియానాలో ఇటీవల మృతిచెందిన తెలంగాణ యువకుడు కె.అనురూప్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. తన స్నేహితులను కాపాడే ప్రయత్నంలో యువకుడు అకాలమరణం చెందడం తీవ్ర ఆవేదన కలిగించిందని రేవంత్ పేర్కొన్నారు. తోటివారి ప్రాణాలు కాపాడేందుకు ఆయన చూపిన ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని అనురూప్ రెడ్డి భౌతికకాయాన్ని స్వదేశానికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యువకుడి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. బాధిత కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనురూప్ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం రేవంత్ భరోసా ఇచ్చారు. కాగా, రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ కవాడిపల్లికి చెందిన అనురూప్ రెడ్డి(23) అమెరికాలోని లూసియానాలో ఉంటున్నారు. సరదాగా గడిపేందుకు తన ముగ్గురు స్నేహితులతో కలిసి ఈ ఏడాది మే 29న టొరో బేయు పార్కుకి వెళ్లారు. అయితే, స్నేహితులు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోతుండగా ఏమాత్రం సంకోచించకుండా వారిని కాపాడారు అనురూప్ రెడ్డి. ఈ క్రమంలో తన ప్రాణాలను కోల్పోయారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకుని అనురూప్ రెడ్డి భౌతికకాయాన్ని నేడు స్వగ్రామానికి చేర్చింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ ఆదేశాలతో కవాడిపల్లికి చేరుకున్న ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, మందుల సామేలు.. అనురూప్ రెడ్డికి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన లేఖను వారికి అందజేశారు. ముగ్గురు యువకులను కాపాడినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అవార్డు, ఆర్థికసాయం అందించనున్నట్లు వారికి నేతలు తెలిపారు.

## ఉద్యోగుల జీతాల చెల్లింపులో జాప్యం

### అధికారుల తీరుపై మండిపడ్డ సిఎం

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపులో జాప్యంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతాల ఆలస్యానికి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. సీఎం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపుపై ఆర్థిక శాఖ కీలక సర్క్యులర్ జారీ చేసింది. రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, హానరేరియం ఉద్యోగులందరికీ 1వ తేదీన వేతనాలు వేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆలస్యమైతే హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్, డీడీఓలదే బాధ్యతని తెలిపారు. ప్రతి నెల 25వ తేదీలోపు జీతాల బిల్లులు ట్రెజరీకి సమర్పించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఈ నెలాఖరులోపు బిల్లుల స్క్రూటినీ, ఆడిట్, అథరైజేషన్ పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి హుకుం జారీ చేశారు. బ్జడెట్ కొరత లేదా సాంకేతిక సమస్యలు ఉంటే ముందుగానే ÷నాన్స్ శాఖకు తెలియజేయాలని సూచించారు. జీతాల చెల్లింపులో పరిపాలనా నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరిచారు. అన్నిశాఖలు, కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, సొసైటీలు ఉత్తర్వులు ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఉద్యోగికి ప్రతి నెల 1వ తేదీన జీతం చేరేలా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

## లోకేశ్ అంటే భయపడుతోన్న జగన్

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తీవ్ర ఆగ్రహం

శ్రీకాకుళం: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అండ్ కోకి లోకేశ్ అంటే భయమని, అందుకే ఆయనను టార్గెట్‌గా చేసుకుని ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ ఫేక్ ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లాల్లో రామ్మోహన్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. డీఎస్సీ విషయంలో వైసీపీ విషప్రచారాన్ని తమ ప్రభుత్వం తిప్పి కొట్టిందని రామ్మోహన్ తెలిపారు. వైసీపీ తాను తీసిన గోతిలో తానే పడిందని ఎద్దేవా చేశారు.

# 21వ శతాబ్దపు నవభారత దార్శనికుడు..

# నరేంద్ర మోదీ నాయకత్వంపై చంద్రబాబు ప్రశంసల జల్లు!

**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ (ఒణూ) జాతీయ అధ్యక్షుడు శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు రాసిన ఒక ప్రత్యేక వ్యాసం ఇటీవల ప్రముఖ పత్రికలో ప్రచురితమైంది. భారతదేశానికి అత్యధిక కాలం పాటు నిరంతరాయంగా పనిచేసిన ప్రధానమంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించనున్న ప్రధాని నరేంద్ర మోదీ మైలురాయిపై చంద్రబాబు నాయుడు ఈ వ్యాసంలో పేర్కొన్నారు. ప్రధాని మోదీ సాధించిన ఈ ఘనత ఆయన నాయకత్వం, దార్శనికతపై భారత ప్రజలు ఉంచిన అచంచలమైన విశ్వాసానికి నిదర్శనమని ఆయన అభివర్ణించారు.**



భారతదేశానికి అత్యధిక కాలం పాటు నిరంతరాయంగా పనిచేసిన ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించారు. 'దేశమే ప్రథమం' అనే నినాదంతో, గత 12 ఏళ్లుగా ఆయన సాగించిన పాలనపై భారత ప్రజలు అచంచలమైన విశ్వాసం ఉంచారు. ప్రాచీన నాగరికతా సంస్కృతిని ఆధునిక పరిపాలనతో మేళవించి, ప్రపంచ వేదికపై భారతదేశ ఆత్మవిశ్వాసాన్ని ఆయన పునరుద్ధరించారు. మోదీ దార్శనికతతో భారత్ ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. మౌలిక సదుపాయాల కల్పన, సహకార సమాఖ్య విధానంతో 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశ సాధనే లక్ష్యంగా ఆయన భారతదేశాన్ని నూతన స్వర్ణయుగం వైపు నడిపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ (ఒణూ) జాతీయ అధ్యక్షుడు ఎన్. చంద్రబాబు నాయుడు రాసిన ఒక ప్రత్యేక వ్యాసం ఇటీవల ప్రముఖ పత్రికలో ప్రచురితమైంది. భారతదేశానికి అత్యధిక కాలం పాటు నిరంతరాయంగా పని చేసిన ప్రధానమంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించనున్న ప్రధాని నరేంద్ర మోదీ మైలురాయిపై చంద్రబాబు నాయుడు ఈ వ్యాసంలో పేర్కొన్నారు. ప్రధాని మోదీ సాధించిన ఈ ఘనత ఆయన నాయకత్వం, దార్శనికతపై భారత ప్రజలు ఉంచిన అచంచలమైన విశ్వాసానికి నిదర్శనమని ఆయన అభివర్ణించారు. "దేశమే ప్రథమం" అనే సూత్రంపై ఆధారపడిన నరేంద్ర మోదీ పాలనా విధానాన్ని చంద్రబాబు నాయుడు అభినందించారు. "భారతదేశానికి సరైన సమయంలో నరేంద్ర మోదీ సరైన నాయకుడు అని తరచుగా చెబుతూ వచ్చాను. గత 12 ఏళ్లలో ఆ నమ్మకం మరింత బలపడింది. చరిత్ర ఈ కాలాన్ని కేవలం ఆర్థిక వృద్ధి లేదా రాజకీయ స్థిరత్వం కోసం మాత్రమే కాకుండా, భారతదేశానికి తనపై తాను విశ్వాసం పునరుద్ధరించుకోవడానికి దోహదపడిన కాలంగా గుర్తుంచుకుంటుంది" అని కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో కీలక భాగస్వామి అయిన చంద్రబాబు పేర్కొన్నారు. తన ఐదు దశాబ్దాల ప్రజా జీవితంలో ఎందరో ప్రధానమంత్రులను గమనించినట్లు తెలిపిన చంద్రబాబు, ప్రధాని మోదీ వారిలో ప్రత్యేకంగా నిలుస్తారని అన్నారు. దానికి కారణం ఆయన ప్రాచీన నాగరికతా విశ్వాసాన్ని ఆధునిక పరిపాలనతో మేళవించడమేనని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చాలా దశాబ్దాల పాటు భారతదేశం తన గుర్తింపు పట్ల సంకోచిస్తూ, నిద్రపోతున్న మహాశక్తిలా ప్రవర్తించిందని, అయితే మోదీ నాయకత్వంలో దేశం తన సాంస్కృతిక గర్వాన్ని, జాతీయ ఆత్మవిశ్వాసాన్ని తిరిగి పొందిందని రాశారు. యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటి భారతదేశపు ప్రాచీన జ్ఞాన వ్యవస్థలను ఆధునిక సాంకేతికత, డిజిటల్ పాలనతో అనుసంధానించడం ద్వారా ప్రధాని మోదీ 21వ శతాబ్దానికి సరికొత్త మార్గదర్శకత్వం వహించారని సీఎం చంద్రబాబు కొనియాడారు. గత ఒక దశాబ్ద కాలంలో భారతదేశం ప్రపంచంలో 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుండి నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం ఈ వ్యూహాత్మక మార్పునకు నిదర్శనమన్నారు. పాలనా సంస్కరణల గురించి ప్రస్తావిస్తూ.. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, జన్ ధన్ ఖాతాలు, ఆధార్ అనుసంధానం, యూపీఐ, ప్రత్యక్ష ప్రయోజన బదిలీల ద్వారా మానవ చరిత్రలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత కార్యక్రమాలలో ఒకటి జరిగిందని చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో లీకేజీలు, మధ్యవర్తుల వల్ల సంక్షేమ పథకాలు పేదలకు చేరేవి కావని, అయితే సాంకేతికత సహాయంతో మధ్యవర్తులను తొలగించి, రూ. 51 లక్షల కోట్లకు పైగా నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి బదిలీ చేయడం ఒక విప్లవాత్మక మార్పు అని చంద్రబాబు కొనియాడారు. కరోనా మహమ్మారి, భౌగోళిక రాజకీయ సంఘర్షణలు, ఆర్థిక అనిశ్చితి వంటి అపూర్వమైన సవాళ్లను ప్రపంచం ఎదుర్కొంటున్న తరుణంలో కూడా భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా స్థిరంగా నిలిచిందని ఆయన గుర్తుచేశారు. రహదారులు, ఓడరేవులు, విమానాశ్రయాలు, రైల్వేలు, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాలలో మోదీ చేస్తున్న దీర్ఘకాలిక పెట్టుబడులు తక్షణ రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా, దేశ ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులని అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలలో పోటీతత్వ, సహకార సమాఖ్య విధానాన్ని తీసుకురావడం ద్వారా రాష్ట్రాలను జాతీయ అభివృద్ధికి కీలక చోదక శక్తులుగా మార్చారని చంద్రబాబు ప్రశంసించారు. ఈ అభివృద్ధి ఆధారిత భాగస్వామ్యం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మౌలిక సదుపాయాలు, పారిశ్రామికీకరణ, అమరావతి ప్రాజెక్టుల ద్వారా ఎంతగానో లబ్ధి పొందుతోందని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 2047 నాటికి 'వికసిత్ భారత్' దార్శనికత వైపు దేశం స్థిరంగా పయనిస్తూ, ఒక నూతన స్వర్ణయుగానికి నాంది పలుకుతోందని చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు.


# ప్రభుత్వ భూముల కబ్జాదారులకు ఇక చెక్..!

- ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను కాపాడాలని ఎంఆర్ఓ పరమేశంకు వినతి
- మెలకుంట చెరువు భూమిని స్వాధీనం చేసుకుని ప్రజల కోసం వినియోగించాలని విజ్ఞప్తి
- ప్రజా ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్
- వినతిపత్రం అందజేసిన గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్

**గుమ్మడిదల, జూన్ 9 ( నేటి ప్రస్థానం ):** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి పారిశ్రామిక వాడాలో పలు పరిశ్రమలు ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టాయని,వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ సోమవారం మండల తహసీల్దార్ (ఎంఆర్ఓ) పరమేశంకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేసి ఆక్రమణలను అరికట్టాలని ఆయన కోరారు.అట్టి భూమిని కాపాడి ప్రజల అవసరాల కోసం వినియోగించాలని కోరారు. ముఖ్యంగా దోమడుగు లో గల మెలకుంట చెరువు కి సంబందించిన భూమి (ఎం టీ ఈ) పరిశ్రమ ఆక్రమించి ప్రహరీగోడా నిర్మించిందన్నారు. ఆ భూమిని విడిపించాలని ప్రజా ఆస్తిని కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా కుమార్ గౌడ్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, కొందరు వ్యక్తులు ప్రభుత్వ స్థలాలను తమ సొంత ఆస్తులుగా భావించి



అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యల వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడంతో పాటు ప్రజా అవసరాలకు ఉద్దేశించిన భూములు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు.ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టేందుకు ఎలాంటి చట్టబద్ధ హక్కు లేదని, ఆక్రమిత భూముల్లో చేపట్టే నిర్మాణాలకు మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు మంజూరు చేయరాదని ఎంఆర్ఓ పరమేశం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అసైన్డ్ భూములను కొందరు అమ్ముకున్నారని వాటిలో పరిశ్రమలు నిర్మాణాలు చేపట్టాయన్నారు.ఆ కొనడం అమ్మడం చట్ట విరుద్ధమని, అలాంటి భూములను రెవెన్యూ శాఖ స్వాధీనం చేసుకొని ప్రజల అవసరాలకు నిమిత్తం అందించాలని అన్నారు.అలాగే మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల పూర్తి వివరాలను సేకరించి వాటి రక్షణకు శాశ్వత చర్యలు చేపట్టాలని, భూ




ఆక్రమణదారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ స్థలాలపై ఎలాంటి ఆక్రమణలు జరగకుండా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు కూడా ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగస్వాములు కావాలని, ఎక్కడైనా ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు లేదా ఆక్రమణలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, ప్రజా ఆస్తులను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భూ కబ్జాదారులు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దొంగ ఖాతాలు.. ఫోర్జరీ పత్రాల కలకలం

### ట్రై కార్పొరేషన్లలో కొనసాగుతున్న అవినీతి..

### ఏసీబీ దాడులతోనూ మారని అధికారుల తీరు




**హైదరాబాద్, జూన్ 9:** ట్రై కార్పొరేషన్లు (జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ) పరిధిలో అవినీతిపై ఒకవైపు ఉక్కుపాదం మోపుతున్నప్పటికీ, మరోవైపు లంచాలు, అక్రమాల వ్యవహారాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వరుస దాడులు నిర్వహిస్తూ అధికారులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంటున్నప్పటికీ కొందరి పనితీరులో మార్పు కనిపించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఇలాంటి పరిస్థితుల్లో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసిన ఓ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ)పై వెలుగులోకి వచ్చిన ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రస్తుతం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఈ అధికారి, ఓ సివిల్ కాంట్రాక్టర్‌కు రావాల్సిన కోట్ల రూపాయల బిల్లులను నకిలీ పత్రాలు, దొంగ బ్యాంక్ ఖాతాల ద్వారా మళ్లించుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.బాధిత కాంట్రాక్టర్ ఫిర్యాదు ప్రకారం, నిజాంపేట్ డంప్ యార్డ్ నుంచి జవహర్‌నగర్ డంప్ యార్డ్‌కు చెత్త తరలింపు పనులను 2023 ఆగస్టు నుంచి 2025 జనవరి వరకు నిర్వహించారు. యంత్రాలు, లేబర్, డీజిల్ తదితర ఖర్చుల కోసం భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టి పనులను పూర్తి చేసినప్పటికీ, ఆయనకు రావాల్సిన బిల్లులు అందలేదని పేర్కొన్నారు.ఈ క్రమంలో జేఎంసీ కన్‌స్ట్రక్షన్స్ పేరుతో నకిలీ సంస్థను సృష్టించి, ఫోర్జరీ జీఎస్టీ, పాన్ కార్డులు తయారు చేసి బ్యాంక్ ఖాతా తెరిచినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ ఖాతా ద్వారా మున్సిపాలిటీ నుంచి విడుదలైన బిల్లుల మొత్తాన్ని డ్రా చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడికి మాత్రం విజిలెన్స్ క్లియరెన్స్ పేరుతో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని చెబుతూ కాలయాపన చేసినట్లు వెల్లడించారు.

**కుటుంబ సభ్యుల పేర్లతో బినామీ వ్యవహారం?**

ఈ వ్యవహారంలో సంబంధిత ఇంజనీర్ తన కుటుంబ సభ్యులనే బినామీలుగా ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నకిలీ సంస్థ యజమానులుగా సోదరి, బావమరిది పేర్లు నమోదు చేసి, బ్యాంక్ ఖాతాకు తండ్రిని అధికారిక సంతకందారుగా నియమించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విధంగా కోట్ల రూపాయల ప్రజాధనాన్ని అక్రమంగా మళ్లించారని బాధితుడు ఆరోపిస్తున్నారు.

**కమిషనర్‌కు ఫిర్యాదు**

తనకు జరిగిన అన్యాయంపై బాధిత కాంట్రాక్టర్ సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌ను ఆశ్రయించారు. నకిలీ బ్యాంక్ ఖాతాలు, ఫోర్జరీ పత్రాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తానే అసలు పనులు నిర్వహించిన కాంట్రాక్టర్‌నని యంత్రాల వినియోగం, లేబర్ రికార్డులు, ఇతర ఆధారాలతో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ ఆరోపణలపై మున్సిపల్ ఉన్నతాధికారులు, ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటాయన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తే ట్రై కార్పొరేషన్లలో మరో భారీ అవినీతి వ్యవహారం బయటపడే అవకాశం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# పేదల ఇళ్ల స్థలాలపై కబ్జాదారుల కన్ను..!

### 72 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడి లబ్ధిదారులకు అప్పగించాలి

### మంబాపూర్ బాధితులతో కలిసి తహసీల్దార్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్


### భూమి సర్వే పూర్తి చేసి 62 మంది లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్

### ప్రభుత్వ భూములపై అక్రమ కన్నేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

**గుమ్మడిదల , జూన్ 9 (నేటి ప్రస్థానం):** పేదల కోసం ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలు ఇప్పటికీ లబ్ధిదారులకు అందకపోవడం, మరోవైపు అదే భూములపై కబ్జాదారుల కన్ను పడటం మంబాపూర్ గ్రామంలో ఆందోళనకు దారితీసింది. ప్రభుత్వ భూమిని పరిరక్షించి, అర్హులైన లబ్ధిదారులకు వెంటనే స్థలాలు అప్పగించాలని కోరుతూ గ్రామస్తులు, యువకులు, పట్టాదారులు భారీ సంఖ్యలో తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ నేతృత్వంలో గ్రామ ప్రజలు తహసీల్దార్ పరమేశంకు వినతిపత్రం అందజేసి తమ సమస్యలను వివరించారు. మంబాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్-8లో ఉన్న 72.18 ఎకరాల ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వం 62 మంది పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించింది. అయితే సంవత్సరాలు గడుస్తున్నా భూమికి పూర్తిస్థాయి సర్వే నిర్వహించకపోవడంతో హద్దులు నిర్ధారణ కాలేదు. దీంతో లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలాలను స్వాధీనం చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని అవకాశంగా మలుచుకుని కొందరు భూ కబ్జాదారులు ప్రభుత్వ భూమిపై కన్నేశారని గ్రామస్తులు ఆరోపించారు. హద్దులు స్పష్టంగా లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ఆక్రమణలకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కేటాయించిన భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లకుండా వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, పేదలకు కేటాయించిన భూములను కాపాడటం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత అని అన్నారు. సర్వే నంబర్-8లోని మొత్తం 72.18 ఎకరాల భూమికి అత్యవసరంగా సర్వే నిర్వహించి, హద్దులను ఖరారు చేసి, అర్హులైన 62 మంది లబ్ధిదారులకు



స్థలాలను అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ భూములపై ఎలాంటి అక్రమ ఆక్రమణలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, కబ్జాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. పేదల హక్కులను పరిరక్షించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. గ్రామస్తులు, యువకులు మాట్లాడుతూ తమకు కేటాయించిన స్థలాలు తమ చేతికి వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంబాపూర్ మాజీ ఉపసర్పంచ్ తలారి దయానంద్, మాజీ వార్డు సభ్యులు యాట దయానంద్, యాట నాగరాజ్, మద్దూరి లక్ష్మణ్, గొట్టి ముక్కుల రాజు, రొయ్యపల్లి శ్రీకాంత్, కొండని ఎల్లయ్య, కాంజర్ల వెంకటస్వామి, నిరుడు శ్రీనివాస్, కొత్తపేట గోపాల్, పట్టా లబ్ధిదారులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### పెట్రోల్ ధరలు పెరుగుతున్నా నష్టాల్లోనే చమురు కంపెనీలు..

# రోజుకు రూ.700 కోట్ల నష్టం

**నేటి ప్రస్థానం:** దేశంలో ఒకపక్క పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు పెరుగుతున్నాయి. ఈ ధరలు సామాన్యుడిని బెంబేలెత్తిస్తున్నాయి. ప్రజల జేబులకు చిల్లులు పెడుతూ చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ చమురు కంపెనీలు నష్టాల బాటలోనే కొనసాగుతున్నాయి. దేశంలో ఒకపక్క పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు పెరుగుతున్నాయి. ఈ ధరలు సామాన్యుడిని బెంబేలెత్తిస్తున్నాయి. ప్రజల జేబులకు చిల్లులు పెడుతూ చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ చమురు కంపెనీలు నష్టాల బాటలోనే కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వం రంగ చమురు కంపెనీలు భారీ నష్టాలు పొందుతున్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నప్పటికీ, దేశంలో కొంతకాలం చమురు ధరలుపెరగలేదు. ఇటీవలి కాలంలో మాత్రం ఈ ధరలు పెరుగుతున్నాయి. ఎల్పీజీపై సగటును ఒక లీటర్‌కు రూ.7.50 ధర పెరిగింది. అయినప్పటికీ కంపెనీలు మాత్రం నష్టాల బాటలోనే నడుస్తున్నాయి. ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు ప్రస్తుతం ప్రతిరోజూ ఒక లీటర్ డీజిల్‌పై రూ.30. పెట్రోల్‌పై రూ.6 వరకు నష్టపోతున్నాయి. ఏప్రిల్ 1 నాటి చమురు ధరల ప్రకారం.. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర పెరిగినప్పటికీ దేశంలో ఆయిల్ ధరలు పెరగలేదు. అప్పట్లో ఒక లీటర్ పెట్రోల్‌పై రూ.24, డీజిల్‌పై రూ.105 వరకు నష్టం వచ్చిందని కంపెనీలు చెబుతున్నాయి. దీంతో కంపెనీలపై తీవ్ర ఆర్థిక భారం పడింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల చమురు ధరల్ని



పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అయినప్పటికీ చమురు కంపెనీలు నష్టాల్లోనే కొనసాగుతున్నాయని కేంద్ర చమురు, సహజవాయువు శాఖ అదనపు కార్యదర్శి ప్రవీణ్ ఖనూజ వెల్లడించారు. ప్రస్తుతం చమురు కంపెనీలు ప్రతి రోజూ సగటున రూ.600 కోట్ల నుంచి రూ.700 కోట్ల వరకు నష్టపోతున్నాయన్నారు. ముఖ్యంగా వంట గ్యాస్ సిలిండర్లపై ఎక్కువ నష్టం వస్తోందన్నారు. 14.2 కేజీల బరువు ఉండే గృహ సిలిండర్‌పై రూ.700 వరకు నష్టం వస్తోంది. కంపెనీలకు తయారీ, నిర్వహణ ఖర్చులకు, వినియోగదారుడు చెల్లించే డబ్బులకు మధ్య భారీ వ్యత్యాసం ఉందని ఖనూజా తెలిపారు. ఇంత నష్టం వస్తున్నప్పటికీ గృహ వినియోగదారులపై భారం పడకూడదని కేంద్రం ప్రయత్నిస్తోందని ఆయన చెప్పారు.నిజానికి ఇప్పుడు గృహ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.1,600 వరకు ఉంటుందని, కానీ, కేంద్రం తక్కువ ధరకే అందిస్తోందని చెప్పారు. ఢిల్లీలో ఈ సిలిండర్ ధర రూ.942 ఉండగా, కేంద్రం ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) పథకం కింద పేదలకు రూ.300 సబ్సిడీ ఇస్తోంది. దీంతో వారికి సిలిండర్ రూ.642కే లభిస్తోంది. ఇటీవల గల్ఫ్ సంక్షోభం ప్రారంభమైనప్పటి నుంచి మన దేశానికి చమురు అందించే సౌదీ కాంట్రాక్ట్ ప్రైస్ (సీపీ) ధర 46 శాతం పెరిగింది. హార్ముజ్ జలసంధి మూసివేయడం, చమురు సరఫరా రవాణాకు ఆటంకాలు ఏర్పడటం కారణంగా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగాయి.

**కేంద్ర పథకాల్లో కోత**

పేదలకు కేంద్ర ప్రభుత్వం పీఎంయూవై కింద ఒక కుటుంబానికి ఏడాదికి 9 సిలిండర్లు గతంలో ఇచ్చేది. కానీ, ఇప్పుడు చమురు సంక్షోభం కారణంగా ఈ సిలిండర్ల సంఖ్యను కేంద్రం తగ్గించింది. ఇకపై ప్రతి ఏడాది ఒక కుటుంబానికి గరిష్టంగా నాలుగు సిలిండర్లు మాత్రమే పీఎంయూవై కింద సబ్సిడీతో ఇవ్వనుంది. సాదారణంగా ఒక కుటుంబానికి ఏడాదికి 4 నుంచి 5 సిలిండర్లు సరిపోతాయని కేంద్రం అంటోంది. అందుకే సబ్సిడీ సిలిండర్ల సంఖ్యను తగ్గించింది. ఇదే సమయంలో సబ్సిడీ మొత్తాన్ని కేంద్రం తగ్గించలేదు. ప్రస్తుతం ఎల్పీజీ సిలిండర్లకు డిమాండ్ బాగా పెరిగింది. దీనికి అనుగుణంగా కంపెనీలు చమురు ఉత్పత్తిని కూడా పెంచుతున్నాయి. గతంతో పోలిస్తే ప్రస్తుతం 60 శాతం ఉత్పత్తి పెరిగింది.

## ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ కార్యాలయం

### ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన శ్రీధర్ బాబు

హైదరాబాద్: ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవ ఏర్పాట్లను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం... సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై వారికి దిశా నిర్దేశర చేశారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.

## హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షం

### అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి పొన్నం

హైదరాబాద్,జూన్9(ఆర్ఎన్ఎ): హైదరాబాద్‌లో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా ఏర్పడిన పరిస్థితులపై హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్ఎంసీ కమిషనర్, సిటీ పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌లతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తక్కువ సమయంలో ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి పేర్కొన్నారు. అనేక ప్రాంతాల్లో మోకాళ్ల లోతు వరకు వర్షపు నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. గరంలోని ఒక్కసారిగా ఈదురు గాలులు వీయడంతో పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోవడం, విద్యుత్ తీగలు తెగిపడిన ఘటనలపై మంత్రి ఆరా తీశారు. విద్యుత్ షాక్ తో ఇద్దరు వ్యక్తులు మరణించారని తెలుసుకున్న సమాచారంతో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.కూలిన చెట్లు ,తెగిన విద్యుత్ తీగలు తొలగించడానికి సహాయక చర్యలను వేగవంతం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ, హైడ్రా, పోలీస్, విద్యుత్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/